నష్టాల్లో మామిడి రైతులు



ఈ ఏడాదైనా మామిడి సాగులో లాభాలు చూద్దామనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. మామిడి పంటను కంటికి రెప్పలా చూసుకున్నా భారీగా నష్టాలు రావడంతో అన్నదాతలు కుదేలై పోయారు. గిట్టుబాటు ధరల్లేక ఎక్కడికి పడితే అక్కడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.





కోత దశలో ఉన్న నీలం రకం మామిడి కాయలు , ఊజీతో ఇంట్లో మూలన పడేసిన గద్దేమరి రకం మామిడి కాయలు

- వరుస తెగుళ్లతో తీవ్ర ఇబ్బందులు
- మందులకే రూ.వేలు ఖర్చు చేసిన రైతులు
- మార్కెట్లో డిమాండ్ లేక తక్కువ ధరలకే విక్రయం
- ఈ ఏడూ కలసిరాని వైనం

పెనుకొండ: ఈసారి పూతదశ ప్రారంభం నుంచే మామిడి సాగులో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేనుబంక పూత దశలో ఆశించడంతో ఉద్యానశాఖ అధికారుల సహకారం కొరవడటం, సరైన అవగాహన లేకపోవడంతో ఫర్టిలైజర్ షాపుల సూచనలు, సలహాలతో వేలకు వేలు ఖర్చు పెట్టి పంట నిలుపుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. మళ్లీ పిందె దశలో వర్షాలు కురవడంతో కాయలు నేలరాలి భారీగా పంట దెబ్బతినింది. ఇక ఉన్న పంటకు పెద్ద ఎత్తున ఊజీ సోకడంతో రైతులు మామిడి కాయలను మార్కెట్లో అమ్ముకోలేక అందిన కాడికి అమ్ముకుంటున్నారు.

నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో...

పెనుకొండ ప్రాంతంలో బేనిషా, బాదామి, రాజ్ బేనిషా, కసి, తోతాపురి, నీలం, గద్దెమర్రి తదితర రకాలను సాగు చేస్తున్నారు. ఇందులో గద్దెమర్రి ఊరగాయ రకానికి వినియోగించేది. నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో ఈ రకాల మామిడి సాగు విస్తరించి ఉంది. గతంలో టన్ను రూ.40 వేల నుంచి రూ.60 వేలు పలికిన బేనిషా ఈ సారి కేవలం టన్ను రూ.20 వేల లోపే పలుకుతుండడం, బాదామి సైతం ఇంకా తక్కువ ధరలకు మార్కెల్లో అమ్ముడుపోవడంతో మామిడి సాగు రైతులు, పంటలను కొనుగోలు చేసిన వారు కన్నీరు పెడుతున్నారు. అలాగే గతంలో టన్ను రూ.25 వేలు అమ్ముడు పోయిన తోతాపురి మార్కెట్లో రూ.12 వేలు అమ్ముడుపోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా రూ.లక్షల్లో నష్టం రావడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. పంటను పేను బంక నుంచి ఇతర తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు ఎకరాకు రూ.15 వేల మేర ఖర్చు చేస్తే కనీసం రూ.30 వేలు కూడా రాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. చూడ్డానికి కాయ పైకి బాగా కనిపించినా లోపల ఊజీ దెబ్బకు పురుగులు పడి తినలేని స్థితికి కాయ చేరుకున్నాయన్నారు. దీంతో మార్కెట్లో కాయలు కొనుగోలు చేయడానికి ప్రజలు విముఖత చూపుతున్నారన్నారు.

కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

పేను బంక, ఊజీ, ఇతర తెగుళ్లతో పాటు వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. పంట దిగుబడితో మంచి లాభాలు అంది కష్టాల నుంచి గట్టెక్కుతామనుకుంటే పరిస్థితి తలకిందులైందని, లక్షల్లోనే నష్టపోయి అప్పుల పాలయ్యామని వాపోతున్నారు. మామిడి రైతులను అధికారులు నేరుగా కలసి పరిస్థితిని తెలుసుకుని తగిన విధంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

రూ.1.60 లక్షలు నష్టపోయా..



మామిడి కాయలకు ధరల్లేక రూ.1.60 లక్షలు నష్టపోయాను. ప్రారంభంలో పేనుబంకతో ఇబ్బందులు, అనంతరం వర్షాలతో సమస్య, తీరా కాయ కోత దశలో ఊజీ తెగులు తీవ్రంగా నష్టపరిచింది. రూ.70 వేలు పురుగు మందులకే ఖర్చు చేశాను. కనీసం రూ. 3 లక్షలైనా వస్తుందనుకుంటే రూ.1.40 లక్షలు మాత్రమే వచ్చి తీవ్రంగా నష్టపరిచింది. మార్కెట్లో కాయలు కొనే వారు కరువయ్యారు. ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకోవాలి.

– వినోద్, పెనుకొండ

నష్టాలకే అమ్ముకుంటున్నాం



ఈ యేడు నల్ల పేనుబంక, కోత దశలో ఊజీ తెగులు మామిడి పంటను తీవ్రంగా దెబ్బతీసింది. కాయ చూడ్డానికి బాగా కనిపించినా లోపల పురుగులు ఉండటంతో కొనడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. మార్కెట్లో వ్యాపారులు సైతం కొనడానికి సుముఖత చూపకపోవడంతో అందినకాడికి అమ్ముకుంటున్నాం. బాదామి, బేనిషా, రాజ్‌బేనిషా, తోతాపురి ప్రతికాయా ఊజీ బారిన పడ్డాయి. మామిడి ఈ యేడు చేదు అనుభవాలను మిగిల్చింది.

– పద్మావతమ్మ, పెనుకొండ

క్లుప్తంగా

సందడిగా 'సరదా జాతర'



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ప్రదర్శన

హిందూపురం: ఆర్యవైశ్య సంఘం, కుసుమ పుత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కల్యాణ మండపంలో సరదా జాతర కార్యక్రమం నిర్వహించారు. నోరు ఊరించే వివిధ రకాల వంటకాలు, ఫ్యాన్సీ చీరలు, రెడీమేడ్ దుస్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు తరలి వచ్చి వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. పెద్ద సంఖ్యలో పట్టణవాసులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



హిందూపురం సబ్‌జైలులో మంజునాథ్‌ను పరామర్శించి వస్తున్న నాయకులు

మడకశిర: నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహామూర్తి విమర్శించారు. మడకశిర సోషల్ మీడియా కార్యకర్త గుండుమల మంజునాథ్‌పై అక్రమంగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారన్నారు. కోర్టు రిమాండ్ విధించడంతో హిందూపురం సబ్‌జైలులో ఉన్న మంజునాథ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. మంజునాథ్ సతీమణి సంధ్యకు ఆర్థిక సాయం అందించారు. మంజునాథ్‌కు బెయిల్ ఇప్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

13న ఎస్ఎస్‌కే సంఘం ఎన్నికలు

- కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ



శని మహాత్ముని ఆలయం

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే (శని మహాత్మ కార్య నిర్వాహక) సంఘం ఎన్నికలు జూలై 13 న జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఐదేళ్లకోసారి జరిగే సంఘం ఎన్నికల్లో గెలిచి పదవీ బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు, పదాధికారులు శనీశ్వర ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నారు. తొలుత 1953లో ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడిగా జీహెచ్ వెంకటసుబ్బయ్యశెట్టి, 1959 నుంచి జి విశ్వనాథశెట్టి, 1960 నుంచి బీఎస్ వెంకటగిరిశెట్టి, 1969 నుంచి ఎం నాగరత్నంశెట్టి, 1979 నుంచి సీ నాగేశ్‌రావు, 1984 నుంచి పద్మనాభయ్య, 1998 నుంచి జీఎస్ ధర్మపాల్, 2020లో కేవీ శ్రీనివాస్, 2023 నుంచి నేటి వరకూ సీఎన్ ఆనందరావు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే వీరిలో జీఎస్ ధర్మపాల్ మాత్రం ఏకంగా ఐదు సార్లు ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఈ నేపథ్యంలో ఈ సారి జరుగుతున్న ఎస్ఎస్‌కే సంఘం ఎన్నికలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మౌర్య రెసిడెన్సిలో ఆదివారం యూటీఎఫ్ నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల పనివేళల్లో బోధనేతర పనులు, శిక్షణ తరగతులు లేకుండా చూడాలన్నారు. ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్ డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తాహీర్‌వలి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్లు జ్యోతి, ఓంకార్‌నాయక్ రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య కూటమి సభ్యులు శ్రీనివాసమూర్తి, బసవరాజు, అజయ్‌కుమార్, తదితరులు పర్యవేక్షించారు.

'ఉపాధి'లో అవినీతిపై విచారణ చేయండి

చిలమత్తూరు: ఉపాధి హామీ పథకంలో అంతులేని అవినీతి జరుగుతోంది. కూటమి ప్రభుత్వ తీరుతో కూలీలకు అన్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కులశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయించాలన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించి విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచులకు కూడా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు. రాజకీయ జోక్యం లేకుండా 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులు స్థానిక సంస్థలకు జమ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం హామి మేరకు గ్రామాల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నును స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సర్పంచ్, సోమవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

బాధితులకు పరామర్శ



అనుసూయమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న దీపిక

లేపాక్షి: మండలంలోని పులమతికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్. దీపిక ఆదివారం పరామర్శించారు. గోపాల్‌రెడ్డి భార్య అనుసూయమ్మ ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడిన విషయం తెలుసుకొని పూలమతికి వెళ్లారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారికి సూచించారు. ఆమె వెంట సర్పంచ్ అశ్వర్థనారాయణ, మండల కన్వీనర్ నిస్సార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు రామాంజినేయులు, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులు రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



నాయకులతో కలిసి మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. ఆదివారం గుడిబండ మండలం చిగతుర్పి పంచాయతీ సర్పంచ్ హనుమంతరాయప్ప స్వగృహంలో జరిగిన ఓ శుభకార్యంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్‌తో కలసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వ తీరును పత్రికలు, సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా అమలు చేశామని ఇటీవల సీఎం చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక అడ్డగోలుగా నాయకులపై కేసులు నమోదు చేస్తున్నారన్నారు.

సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న యూటీయూసీ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసన్

హిందూపురం: కార్మిక చట్టాలను కుదిస్తూ నాలుగు కోడ్‌గా తీసుకొస్తున్నారని దీనిని వ్యతిరేకించాలని యూటీయూసీ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసన్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆదివారం వివిధ సంఘాలతో సమావేశమయ్యారు. జూలై 9న నిర్వహించనున్నట్లు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అంజన్ మూర్తి, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కె.కోటేశ్వర్, రఘు, వివిధ సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, నరసింహప్ప, శ్రీరాములు, శివప్ప, భాస్కర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి కొత్త నిబంధనలతో కార్మిక సంఘం వ్యవస్థను నిర్వీర్యం చేసే లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తున్నట్లు తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. ఆదివారం తూమకుంట పారిశ్రామికవాడలో కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. జూలై 9వ తేదీ నిర్వహించబోయే ర్యాలీలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి మహిళా సర్పంచులకు శిక్షణ

మడకశిర: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మహిళా సర్పంచులకు సోమవారం నుంచి డివిజన్‌స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలకూ శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. బుధవారం వరకూ శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై మహిళా సర్పంచులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. మహిళా సర్పంచులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

శిథిలావస్థలో ఐరన్ బ్రిడ్జి



తుప్పపట్టి రంధ్రాలు పడిన చౌడేశ్వరీ కాలనీలోని ఐరన్ బ్రిడ్జి



ప్రమాదకరమైన బ్రిడ్జిపై సైకిల్‌తో బాలుడు

హిందూపురం టౌన్: పట్టణంలోని 2వ వార్డులో ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసమున్న చౌడేశ్వరీ కాలనీలో ఐరన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జిపై రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం కొట్నూరు చెరువు మరువ నీరు చౌడేశ్వరి కాలనీ సమీపంలో ఉన్న పెద్ద కాలువ ద్వారా దిగువ ప్రాంతానికి వెళ్లే క్రమంలో నీరు ఉధృతంగా వెళ్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐరన్‌బ్రిడ్జిను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని నెలల నుంచి ఐరన్ బ్రిడ్జి అక్కడక్కడా తుప్పు పట్టి రంధ్రాలు పడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఈ బ్రిడ్జిపై నుంచి నిత్యం మేళాపురం నుంచి చౌడేశ్వరీ కాలనికీ ప్రజలతో పాటు దీప్తి పాఠశాల, వేలంగిణి మాత పాఠశాల, మనస్వి పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. తప్పు బడుతున్న ఐరన్ బ్రిడ్జికి మరమ్మతులు చేసి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని 2వ వార్డు కౌన్సిలర్ రామచంద్రతో పాటు స్థానికులు కూడా కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



పరిగి జెడ్పీ స్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



కోడూరు ప్రాథమిక పాఠశాలలో..

పరిగి: మండల కేంద్రంలోని పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. 1987–88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండల పరిధిలోని కోడూరు ప్రాథమిక పాఠశాలలో 24 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. 2000–2001లో పదోతరగతి చదువుకున్న మండలంలోని పూర్వ విద్యార్థులు కోడూరు ప్రాథమిక పాఠశాల వేదికగా కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు. వివిధ రంగాల్లో స్థిరపడిన 50 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులో సత్యసాయి పరస్పర సహాయక సహకార పరిమిత సమాఖ్య 15వ వార్షిక మహాసభ ఆదివారం నిర్వహించారు. ప్రొఫెసర్ త్రిలోచనాశాస్త్రి మాట్లాడుతూ రైతు పరస్పర సహాయక సహకార సంఘాలు ఆర్థికంగా పురోగతి చెందాలన్నారు. రైతు సంఘాల అభివృద్ధి కోసమే సంఘం సభ్యుల సహకారంతో నూతనంగా కంది బేడల మిషన్ కూడా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అశ్వర్థరెడ్డి, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆశావర్కర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

రొద్దం: మండలంలోని పెద్దమంతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖాళీ ఉన్న ఒక ఆశా వర్కర్ నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పరపల్లి, చెరుకూరు గ్రామాల పరిధిలోని ఒక ఆశా వర్కర్ ఖాళీగా ఉందన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

హిందూపురం టౌన్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వివిధ వార్డులలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రిలోని పీపీ యూనిట్ వైద్యాధికారి కేసీకే నాయక్ తెలిపారు. 4వ వార్డు రెండో ఆర్టీసీ కాలనీ, 32వ వార్డు అహ్మద్‌నగర్, 14వ వార్డు సూగూరు సచివాలయాల పరిధిలో మొత్తం మూడు ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హిందూపురం: పట్టణంలోని కొట్నూరు వద్ద ఆదివారం పేకటస్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,140 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: మండలంలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారి మూల ప్రతిమకు అర్చకులు గంగాజలంతో శుద్ధి చేసి అభిషేకించారు. అనంతరం వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో స్వామివారిని కొలిచే గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించుకోవాలన్నార. మండలస్థాయి అధికారులు విధిగా హాజరై ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించాలని కోరారు.

సప్తమాత్రుక అమ్మవారికి పూజలు



వైష్ణవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

పరిగి: మండల కేంద్రం పరిగిలో సుప్రసిద్ధ పురాతన ఆలయం సప్త మాత్రుక ఆలయంలో ఆషాడ గుప్త నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు వైష్ణవీదేవి అలంకరణలో దర్శనం కలిగించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.